





మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిన్నారం బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశంగౌడ్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

# అధినేత ఆశీస్సులు

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన జిల్లా ప్రజాప్రతినిధులు**

# సదా మీ సేవలో ఉంటా

- జీవితాంతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఝరాసంగంలో కృతజ్ఞతా సభ

ఝరాసంగం, డిసెంబర్ 5 : ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం ఝరాసంగం మండల కేంద్రంలోని వాసవీ మండపంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తన గెలుపు కోసం పగలు, రాత్రులు కష్టపడిన కార్యకర్తలు, నాయకులను కృతజ్ఞతలు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, మండల అధ్యక్షుడు వేంకటేశం, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హఫీజ్ పహిల్వాన్, అజీజ్ భాయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావును పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

## కేతకీలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఝరాసంగం, డిసెంబర్ 5 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అర్చకులు ఆలయ రాజగోపురం ఎదుట ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదాచారణ చేసి గర్భగుడిలో పార్వతీ సమేత సరమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# కలిసిమెలిసి ముందుకెళ్దాం



కోహీర్ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- ఎల్లవేళలా అండగా ఉంటా
- నా విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు
- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- కోహీర్‌లో ఘనంగా విజయోత్సవ సభ
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

కోహీర్, డిసెంబర్ 5 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా కలిసి మెలిసి ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. రెండో సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొనింటి మాణిక్‌రావుకు మంగళవారం కోహీర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ కుటుంబంలో పదేండ్లుగా కలిసిమెలిసి ఉన్నామని భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండాలని,అందరూ ఒక్కతాటిపై ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోవడం నిరాశ పరుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులను సమానంగా కేటాయిస్తామన్నారు. తన విజయం కోసం కష్టపడిన ప్రతిఒక్క కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో మాణిక్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, సర్పంచులు రాజశేఖర్, నర్సింహులు, సంగారెడ్డి, కృష్ణ, వెంకట్‌రామిరెడ్డి, ఎంపీటీసీ బక్కారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నాగరాజు, కలీం, సుభాశ్‌రెడ్డి, వహీద్, గోవర్ధన్ రెడ్డి, ఉమర్ అహ్మద్, మ్యాథరి ఆనంద్, మొగులయ్య, గణేశ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కరణ్, రియాజ్, సందీప్, రమేశ్, తుక్కప్ప, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# 'పాగాల'కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య రాజవరంలో అంతిమయాత్ర
- అంత్యక్రియల్లో పాల్గొని పార్థివదేహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కుటుంబ సభ్యులను ఓదార్చి.. భరోసా
- అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది : కేటీఆర్
- అన్నీ తామై చూసిన ఎమ్మెల్యేలు పల్లా, కడియం
- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, ముత్తిరెడ్డి, ఎంపీ దయాకర్, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు
- కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జనగామ జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి భార్య సుజాత, కుమార్తె సంసజనను ఓదార్చుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జనగామ, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం చిల్పూరు మండలం రాజవరంలో అశేష జనావళి కన్నీటి నడుమ ముగిశాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, ఉమ్మడి జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన గులాబీ శ్రేణులు తుది వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని సంపత్‌రెడ్డి పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి పాగాల తండ్రి జయపాల్‌రెడ్డి, సోదరులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సహా భార్య సుజాత, కుమార్తె సంజనా, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటూ మీ వెన్నంటి ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పాగాల సంపత్ రెడ్డి హఠాన్మరణం బాధాకరమన్నారు. 14 ఏండ్లు కేసీఆర్ వెంట ఒక సైనికుడిలా ఉండి పని చేశారని, ఆయన మరణం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కలిచివేసిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేశారన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్, పార్టీ శ్రేణుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్న కేటీఆర్ ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. నేడు (బుధవారం) రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జడ్పీ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు పార్టీ కార్యాలయాల్లో అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాగాలకు ఘనంగా నివాళులర్పించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలోనూ జనగామ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం చేసిన పాగాల హఠాన్మరణం చెందడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఆయన ఆకస్మిక మృతి రాష్ట్ర వ్యాప్తం గా పార్టీతో పాటు ముఖ్యంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజానీకానికి తీరని లోటని పేర్కొన్నారు. చిన్న వయస్సులో దూరం కావడం దురదృష్టకరమని, హఠాన్మరణం పట్ల కుటుంబానికి తనతోపాటు రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ తరపున సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. పాగాల కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఆయన కుమార్తె చదువు బాధ్యత సహా ఆర్థిక ఇబ్బందులను సైతం పార్టీ తీరుస్తుందని భరోసానిచ్చారు.

**దగ్గర ఉండి అంత్యక్రియలు జరిపించిన పల్లా, కడియం..**

పాగాల సంపత్‌రెడ్డి సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందగా ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి హుటాహుటిన రాజవరం చేరుకుని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంపత్‌రెడ్డి అంత్యక్రియల్లో ఎలాంటి లోపాలు జరుగకుండా కుటుంబ సభ్యులకు వెన్నంటి ఉండి వారికి ధైర్యాన్నిచ్చారు. సంపత్‌రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండ ప్రకాశ్, మార్నేనేని రవీందర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్పీచైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలపాటు ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. అంతిమయాత్రలో పల్లా, కడియం సహ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, స్నేహితులు పాల్గొన్నారు.

### పాగాల మృతి బాధాకరం..

'ఉద్యమంలో సంపత్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించారు..నిబద్ధత గల నాయకుడిగా సేవలందించారు. ఆయన అకాల మరణం నన్ను కలిచివేసింది. ఇక లేరనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బీఆర్ఎస్ కుటుంబానికి, జనగామ జిల్లాకు తీరని లోటు వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కలిగించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నా'

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

### దురదృష్టకర సంఘటన..

మలిదశ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన పాగాల సంపత్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను, అభివృద్ధి ఫలాలను జిల్లా ప్రజలకు అందించాడు. రెండు దశాబ్దాలకు పైగా గులాబీపార్టీతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

– కడియం శ్రీహరి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే